❖•❖•❖ 44 ❖•❖•❖

# నేరస్థుడుగా మరణించిన నేరస్థుడు

*"వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు – 'నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని' చెప్పెను" (లూకా 23:39).*

"అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను" అని యెషయా 53:9ఎలో వ్రాయబడియున్న ప్రవచనము నెరవేర్పు ప్రకారము, యేసు ఇద్దరు నేరస్థుల నడుమ సిలువవేయబడ్డాడు. "మరియు కుడివైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువవేయబడిరి" అని మత్తయి వ్రాస్తున్నాడు (మత్తయి 27:38).

ASV, NASB మరియు NIV వ్యాఖ్య ప్రకారము, ఈ ఇద్దరు "బందిపోటు దొంగలై" యుండిరి (మత్తయి 27:38; మార్కు 15:27). KJVలో "దొంగలు" అని వ్రాయబడి యున్నది. వీరిని వివరించుటకు పరిశుద్ధాత్మ *lestes* అను గ్రీకు పదమును ఉపయోగించారు. అనగా వీరు బలవంతముగాను దౌర్జన్యముగాను దోచుకొనువారని ఈ పదము చిత్రీకరించుచున్నది, ఆయన చెప్పిన మంచి సమరయుడు ఉపమానములో దొంగలను వివరించుటకు యేసు కూడ ఇదే పదమును ఉపయోగించాడు (లూకా 10:30). లూకా వీరిని *kakourgous* అని పిలుచుచుండగా, NASB "నేరస్థులు" అని అనువదించుచున్నది మరియు KJV మరియు ASV వీరిని "కీడుచేయువారు" "నేరము చేసినవారు" అని అనువదించుచున్నవి (లూకా 23:32). ఈ పదము దౌర్జన్యపూరితంగా అపరాధములు చేయువారి సందర్భములో ఉపయోగించబడినది. ఈ ఇద్దరు రోమా ప్రభుత్వమును గద్దె దింపివేయుటకు ప్రయత్నించుచుండిన విప్లవకారులై యుండవచ్చును. అలాగైతే, రాజ్య పాలనమునకు వ్యతిరేకమైన వారి దురాక్రమణ ఈ దొంగతనములకు, దోపిడీలకు మరియు హత్యలకు దారితీసిందన్నమాట. వారు "న్యాయంగానే" పట్టబడ్డారు మరియు మరణశిక్ష విధింపబడ్డారని బందిపోటు దొంగ బాగా చెప్పాడు (లూకా 23:41).

పనుల సౌలభ్యం కోసం పిలాతు ఈ ఇద్దరిని ఆ నాటి తీర్పు కార్యక్రమ వివరముల పట్టికకు అదనంగా చేర్చియుండవచ్చును. బహుశ వారు సిలువవేయబడు నిమిత్తము ఆయన వారిని ఆ నాటి వరకు ఆపియుంచి, సానుకూల సమయం ఎప్పుడు వస్తుందా అని వేచియుండవచ్చును. ఆ నాటి ఏర్పాట్లు మరియు పరిస్థితి అంతా అధమాధమంగా అగుపించునట్లు ఆయన వారిని యేసుతో కూడ సిలువవేయుటకు ఎన్నుకొన్నాడనునది కూడ సాధ్యమే. అనగా, దుర్మార్గపు చేష్టలనుబట్టి దేశమంతా పేరుగాంచిన బందిపోటు దొంగలు నడుమ వారి రాజును సిలువవేయుట ద్వారా, యూదులు ఆయనకు కలుగజేసిన కష్టానికి ప్రతిఫలమన్నట్లు పిలాతు ప్రవర్తించుచుండెను. మరొక ప్రక్క, ఈ ఇద్దరు బరబ్బతో కూడ ఈ శుక్రవారం నాడు మరణించవలెనని అదివరకే తీర్పు యివ్వబడి యుండవచ్చును. వారి కొరకు మూడు సిలువలు తయారు చేయబడి సిద్ధంగా ఉండినవి. ఏదిఏమైనా, విడుదల

చేయబడుటకు ఎవరిని కోరుకొందురో ఎన్నుకొనండి అని అడుగబడినప్పుడు, పస్కా పండుగకు వచ్చిన జనసమూహము బరబ్బను, ముగ్గురిలో ఘోరాతిఘోరమైన నేరస్థుడు, విడుదల చేయబడవలెననియు, యేసు సిలువవేయబడవలెననియు ఎన్నుకొన్నది.

యేసు తీర్పు సందర్భములో చెలరేగిన ఆగ్రహావేశంతో కూడిన అమితానందోత్సాహములో, సిలువవేయబడుటకు మునుపు సాధారణంగా చేయబడుచుండినట్లు ఈ ఇద్దరు దొంగలు కొరడాతో దెబ్బలు కొట్టబడకుండానే మరణ ఊరేగింపులోనికి చేర్చబడియుందురు. వారు కలువరిగిరికి తీసికొనిపోబడుచుండగా ఎవరి సిలువను వారు వారి భుజములపై మోయునట్లు ఏర్పాటు చేయబడినది. అక్కడ, వారు యేసుకు ఇరుప్రక్కల నిలిపియుంచబడిన సిలువకు మేకులతో దిగగొట్టబడ్డారు.

వారి సిలువలు నిటారుగా నిలువబెట్టబడినది మొదలుకొని అదే సిలువపై వారు మరణించినంత వరకు అనుభవిస్తూనే ఉండిన వేదనతో కూడిన నిరాశామయ నీచ పరిస్థితి లోనికి వారు ప్రవేశించుచుండగా, ప్రయాణ ప్రారంభం కూడ వారు యేసును అపహాస్యం చేయుచునే యుండిరని స్పష్టమగుచున్నది. యేసుపై అవమానకరమైన అపవాదులను విసరుటకు ఈ ఇద్దరు కూడ జనసమూహంతోను యూదుల నాయకులతోను చేరిపోయారు. "ఆయనతో కూడ సిలువవేయబడిన బందిపోటుదొంగలును ఆలాగే – మార్గమున వెళ్లుచుండినవారును ప్రధాన యాజకులును పలికిన మాటలతో – ఆయనను నిందించిరి" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:44).

కొంతసేపైన తరువాత, నేరస్థులలో ఒకని మనస్సులో యేసును గూర్చి కొంత మార్పు వచ్చింది. అపరాధములు చేయుచుండినవాడైయుండినవాడు ఇప్పుడు ఒక శిష్యుడయ్యాడు, బందిపోటు దొంగ వంటి హృదయము కలిగియుండినవాడు ఇప్పుడు విశ్వాసి హృదయములగలవాడయ్యాడు. వాడు యేసును జాగ్రత్తగా చూస్తూనే ఉన్నాడు. తనను సిలువవేయుచుండినవారి యెడలను సిలువమరణము యెడలను ఆయన కనుపర్చిన ప్రతిస్పందనలను గమనిస్తున్నాడు, ఆయన చేసిన విజ్ఞాపన ప్రార్థనలు విన్నాడు. యేసు నిజముగా క్రీస్తయియున్నాడనియు ఆయన త్వరలోనే తన రాజ్యములోనికి ప్రవేశింపబోతున్నాడనియు వాడు చూచిన మరియు విన్న విషయాలు వానిని ఒప్పించాయి. తత్ఫలితంగా, మొదటి దొంగ యేసును యింకా అవమానపర్చుచునే యుండినప్పుడు, ఇతడు – రక్షణలోనికి వచ్చుచుండినవాడు – సరిగ్గా సరిపడు గద్దింపుతో కూడిన సమాధానమిచ్చాడు. "అయితే రెండవవాడు వానిని గద్దించి – నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసినవాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యీయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పెను" అని లూకా వ్రాస్తున్నాడు (లూకా 23:40, 41).

పాపములోనే మరణించిన అపరాధిని గూర్చిన వివరము కొద్దిపాటిదే కానీ హృదయవికారమైన వివరమును మనకిచ్చుటకు పరిశుద్ధాత్మ ఎన్నుకొన్నాడు. అతడు చెప్పిన దానిని, అతడు కలిగియుండిన వైఖరిని, మరియు అతడు మరణించిన తీరును పరిశుద్ధాత్మ మనకు తెలియజెప్పుచున్నాడు. వాడు యేసు ప్రక్కలోనే ఎంతో సమీపంగా ఉండినప్పటికిని వాడు ఆయనకు ఎంతో దూరములో ఉండినాడు! వాడు తెరువబడియుండిన రక్షణ ద్వారము యొద్దనే నిలువబడి యుండినాడు కాని దానిలోనికి ప్రవేశించకుండుటకు ఎన్నుకొన్నాడు.

వాడు యేసు సమక్షములోనికి నశించినవాడుగా వచ్చి ఆయన సన్నిధిలోనుండి అదే నశించిన దుస్థితిలో వెళ్లిపోయాడు. వాడు చేసిన పొరపాట్లేంటి? జరిగిన తప్పేంటి?

*వాడెక్కడ ఉండినాడో గమనించుకొననివాడు ఒకడిక్కడ ఉన్నాడు.* వాడు యేసు సన్నిధిలో ఉండినాడు, కానీ ఆ విషయాన్ని వాడు గుర్తించలేదు. వాడు సిలువ చెంత ఉండిన వారందరినీ చూస్తున్నాడు కానీ యేసును మాత్రం చూచుట లేదు. "నేను యేసును చూడగలిగియుండినట్లయితే – వాస్తవంగా నేనాయన మాటలు వినగలిగి ఆయన ముఖము వైపైనా చూడగలిగినట్లయితే – నేను ఖచ్చితంగా నమ్ముతాను" అని చెప్పడం మనకు మామూలే, ఏదిఏమైనా, ఇతనికి ఇటువంటి గొప్ప సదవకాశముండినప్పటికిని అతడు అందుబాటులో ఉండిన ఆ ప్రాముఖ్యమైన పరిస్థితిని కైవశం చేసికొనుటకు విఫలుడయ్యాడు.

*మనకు ఎదురయ్యే అత్యంత అసాధారణమైన అవస్థలు.* ఉత్తమోత్తమ అవకాశములను మనకు అందుబాటులో ఉంచుచున్నక్షణములైయుండగలవని మనము జ్ఞాపకముంచుకొనవలెను. ప్రపంచ చరిత్రలో ప్రఖ్యాతులైన కొందరు మాత్రమే యేసుకు ఇంత దగ్గరగా ఉండి ఆయనను చూడగల ఈ ప్రత్యేకార్హతను కలిగియుండిరి. యేసు మరణించుచుండిన సమయంలో ఇద్దరు మాత్రమే ఆయనకు ఇరువైపుల వ్రేలాడుచుండిరి. ఇతనికి ఒక గొప్ప అవకాశముండినది. కానీ వాడు దాని మహత్వపూర్ణమైన మహిమను ఎన్నడూ చూడలేదు. వాడు బాధకును జనసమూహమునకును లొంగిపోయి యుగములన్నిటిలోను సర్వోచ్ఛమైన ఈ అనుభవమును – యేసు ప్రక్కలోనే మరణించుట – అనుభవించలేదు!

వాడు యేసు పలుకుచుండిన సద్వాక్కులు వినుటకు బదులుగా జనసమూహము పలుకుచుండిన దుర్భాషను వినుచుండెను. సిలువకు దగ్గరలో ఉండినవారు యేసును ఎత్తిపొడుపు మాటలతో ఎగతాళి చేయుచుండిరి. "ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూచుచు, దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము! నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుమని చెప్పుచు ఆయనను దుషించిరి" (మత్తయి 27:39, 40). ప్రధానయాజకులు, శాస్త్రులు మరియు ప్రజల పెద్దలు కూడ ఇటువంటి మాటలనే పలుకుచుండిరి. వీరందరు పలుకుచుండిన మాటలు విని, ఇతడు ఆలోచనా రహితంగా అందరితో కలిసిపోయి వారివలెనే యేసును దూషించుటకు మొదలుపెట్టాడు. వాడు సిలువచెంత నుండిన వారి స్ఫూర్తిని జీర్ణించుకొన్నవాడై, యేసు వైపు తిరిగి, "నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుము!" అని పలికాడు (లూకా 23:39). వాడు యేసు సిలువమీదనుండి చేసిన ప్రార్థనలు ఆలకించలేదు లేదా ఆయన ప్రవర్తనను అధ్యయనము చేయలేదు. వాడు ఏంచేయాలో ఏంచెప్పాలో సిలువ దగ్గర ఉండిన బుద్ధిలేనివారు వానికి చెప్పునట్లు చేసికొన్నాడు.

*వానికి అందుబాటులోనే ఉండిన రుజువు యొక్క విలువను వాడు చిత్తశుద్ధితో అంచనా వేయలేదు.* దేవుడు వీనికి చాలినంత రుజువును అనుగ్రహించాడు. వీని గూర్చి మనకు ఎక్కువగా తెలియజెప్పబడలేదు. కానీ దేవుడు వానికి బోధించిన బోధయే చాలినదని మనము చూడగలము. రెండవ దొంగ వానికివ్వబడిన దానిని పుచ్చుకొన్నాడు, అంగీకరించాడు, విశ్వసించాడు, మరియు పరదైసుకు కొనిపోబడ్డాడు. మొదటి దొంగ కూడా ఇలాగే చేయగలిగియుండెను. విశ్వాసించుటకు ఇష్టపడు ప్రతివానికి, సత్యమును ఆశించు ప్రతివానికి, అవసరమైన రుజువునంతా దేవుడు సమకూర్చును. విశ్వసించుటకు నిరాకరించు ప్రతివానికి,

అత్యంత నాణ్యమైన నిదర్శనము సహితము – యేసు సిలువమీద వ్రేలాడబడియుండుట వంటి నిదర్శనము – వానిని ఒప్పించుటకు చాలినదై యుండదు.

*వాని యెదుట ఉండిన అవకాశము చేజారిపోతుందేమోనని దానిని వెంటనే చేజిక్కించుకొనలేదు.* వాని జీవితాంత సమయంలో సహితం, యేసుతో కూడ గడుపుటకు ఆ దొంగకు కొంత సమయం – దాదాపు ఆరు గంటలు మాత్రమే – ఇవ్వబడింది. వాని జీవితంలో ఎక్కువ కాలం, వాని సిలువమరణమునకు ముందు, తప్పులు చేయుటతోనే గడిచిపోయి యుండవచ్చును. వాడు పయనించిన బాట చిట్టచివరకు వానిని సిలువ వరకు తీసికొనివచ్చింది. ఏదిఏమైనా, వాడు సిలువ వరకు వచ్చి దాని మీద వ్రేలాడబడి యుండిన ఈ ఆరు గంటల వ్యవధిలో, వాడుకూడ రెండవ దొంగవలెనే యేసు వైపు మళ్లుటకు వానికి చాలినంత సమయం ఇవ్వబడింది. వాడు అంత (ఎంత) చెడ్డవాడైనా, యేసును ముఖాముఖిగా కలుసుకొనగలుగునట్లు వానిని తీసుకురాకుండానే వాడు ఈ లోకమును విడిచి వెళ్లిపోవునట్లు దేవుడు అనుమతించలేదు, నిత్యత్వమునకైన వాని సిద్ధపాటు తుది గడియలు దేవుని కుమారుని ప్రక్కలోనే గడుపబడినవి. సిలువచెంత ఉంటూ యేసును, కొన్ని అడుగుల దూరంలోనే వ్రేలాడుచు, వాని కొరకును ప్రపంచములో ఉన్న పాపులందరి కొరకును మరణించుచుండిన యేసును, ఎగతాళి చేయుచుండినవారి ప్రభావమునే వాడు ఎంపికచేసికొనుటనుబట్టి వాని శాశ్వత గమ్యము నిర్ణయింపబడింది. వాడు సజీవులుండు దేశములో నుండి శాశ్వతంగా వెళ్ళిపోక మునుపు అందుబాటులో ఉండిన ఈ సదవకాశమును నిర్లక్ష్యంగా నిరాకరించాడు.

మనలను మనము ఆయన హస్తాలకు అప్పసంగా అప్పగించుకొన్నట్లయితే దేవుడు మన జీవితంలోని అత్యంత చెడ్డ దినమును తీసికొని అత్యంత శ్రేష్ఠమైన దినముగా మార్చగలడు. సిలువవేయబడుటను మించిన భయంకరమైన సన్నివేశము మరొకటేదైనా ఉంటుందేమో నీవు ఊహించుకొనగలవా? వీని విషయంలో, అదొక ప్రముఖంగా గొప్పదైన విషాదాంతమయ్యింది. వాడు వాని జీవితమును విప్లవమునకు, నేరాలు చేయుటకు, మరియు నాశనము సృష్టించుటకు అంకితం చేసికొన్నాడు. గనుక వాడు పట్టబడ్డాడు, నేరనిర్ధారణ చేయబడ్డాడు, భయంకరమైన సిలువ మరణమునకు అప్పగింపబడ్డాడు. వీని జీవిత చరిత్ర పాపముతో మాసిక పడియున్నది, బాధతో నిండియున్నది, మరియు వైఫల్యములో చుట్టబడి యున్నది. వాని జీవితం నిరీక్షణ శూన్యమైనదై యుండినట్లు అగుపించుచున్నది, అది వానికి ఎరుక లేకపోయినప్పటికిని, వాని జీవితము లోకము ముందర పరిశుద్ధ లేఖనముల ద్వారా యుగాంతము గనుక ప్రదర్శింపబడవలసినదై యుండినది. వాడు యేసు వైపు చూచి, ఆయనయందు విశ్వాసముంచి, దేవుని తట్టు తిరిగియుండినట్లయితే వాని కథే మారిపోయేది. వాడు వాని యెదుట ఉంచబడిన రుజువును అంగీకరించి, రెండవ దొంగ చేసినట్లే, వానిని రక్షించుమని యేసును అడుగవలసినయుండెను. వాని జీవితంలో "ఆలశ్యం అమృతం విషం" అన్నట్లుండిన ఈ స్థితిలో సహితం, యేసు వానిని ఎంతో సంతోషముతో అంగీకరించి, వానిని కూడా పరదైసుకు కొంచుబోయియుండును. దుఃఖదాయకమైన వాని కథ ఎప్పుడైనా చెప్పబడిన ఒక అత్యంత మనోహరమైన కథ, బైబిల్‌లో వ్రాయబడియున్న దేవుని కృపను గూర్చిన అత్యంత ఆశ్చర్యకరమైన ఉదాహరణమయ్యేదే.

అతని యెదుట ఒక అవకాశం ఉండినది, కానీ అతడు దానిని అందుకొనలేదు. వాడు

యేసు ప్రక్కన సిలువ మీద వ్రేలాడజేయబడ్డాడు, కానీ ఆయన వానిని తన రాజ్యములో భాగంగా చేసికొనవలసినదని యేసును అడుగకుండానే భయంకరమైన ఆ గడియలన్నింటిని గడిపాడు. వాని జీవితంలో, "నాకు కనీసము ఒక్క మంచి తరుణము దొరికినట్లయితే, నేను దానిని చేజిక్కించుకొని జీవిస్తాను. జీవితం నాకు ఒక్క ఆశాజనక అవకాశమునిచ్చినట్లయితే, ఒక ప్రత్యేక గడియనిచ్చినట్లయితే, నేను దానిని కైవశంచేసికొని నన్ను నేను మంచివానిగా మార్చుకొంటాను" అని అనేకసార్లు వానికి వాడు చెప్పుకొనియుంటాడు, దేవుడు వానికి ఆ గొప్ప అవకాశమునిచ్చాడు. ఆయన వాని యెదుట నిత్యజీవ ద్వారమును తెరిచియుంచాడు, కానీ ఆ దొంగ ఆ తరుణమును కళ్లారా చూచి కైవశం చేసికొనుటకు విఫలుడయ్యాడు.

ఇంతలోనే సైనికులు వచ్చి వాని కాళ్లు విరుగగొట్టారు. "కాబట్టి సైనికులు వచ్చి ఆయనతో కూడ సిలువవేయబడిన మొదటి వాని కాళ్లను రెండవవాని కాళ్లను విరుగగొట్టిరి" అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 19:32). వారు వాని కాళ్లను నలుగగొట్టుచుండగా, వాడు ఆ బాధను భరించలేక వానిలో యిక ఏ మాత్రం మిగిలియున్నా ఆ బలమునంతటిని ఒక్కసారి కూడగట్టుకొని బిగ్గరగా కేకలు వేశాడనుటలో సందేహమేమీ లేదు. ఇప్పుడిక వాని కాళ్లు వాని శరీరమునకు ఆలంబనమియ్యలేవు గనుక, వాని చేతులలో దిగగొట్టబడిన మేకులను ఆధారంచేసికొని, క్రిందికి క్రుంగిపోయాడు. వాడు ఊపిరాడక గిలగిల కొట్టుకొన్నాడు, కానీ ఊపిరి సరిగా పీల్చుకొనలేకపోయాడు, విడువలేకపోయాడు. కొంచెము సేపు, తన ఊపిరిని పొడిగించుకొనగలుగుటకు ఉద్రిక్తముగా పోరాడిన తరువాత, ఉక్కిరిబిక్కిరైపోయి తుది శ్వాస విడిచాడు; వానిని ప్రేమించి వానిని రక్షించుటకు ప్రయత్నించిన దేవుని కలిసికొనుటకు వెళ్లిపోయాడు. ఏమైయుండేదో అని ఆలోచించుచు నిరంతరము నిలిచియుండు దాని యుగాలను గడుపుటకు నిత్యత్వములోనికి వెళ్లిపోయాడు.

బందిపోటు దొంగ ఎప్పుడు బందిపోటు దొంగ కాడు? హంతకుడు ఎప్పుడు హంతకుడు కాడు? ఒకడు ఒక్కసారి ఏదైన ఒక వస్తువును దొంగిలించినట్లయితే లేదా ఎవరినైనా హత్యచేసినట్లయితే, వాడు ఎప్పటికీ దొంగనేనా లేక హంతకుడేనా? సువార్త యొక్క శుభసందేశమిదే: యేసు, తన ప్రశస్తమైన రక్తము చేత, ఒకరిని క్షమించినప్పుడు, దేవుని దృష్టిలో ఆ వ్యక్తి యిక ఎన్నటికినీ అదివరకటి వ్యక్తి కాడు. యేసు ప్రక్కలో ఇద్దరు నేరస్థులు, ఒకడు కుడివైపునను మరొకడు ఎడమ వైపునను సిలువవేయబడ్డారు. ఒకడు నేరస్తుడుగానే మరణించాడు, కానీ రెండవవాడు – దేవుని మహిమాన్వితమైన కృప – పరిశుద్ధుడుగా మరణించాడు.

❖•❖•❖

*"మోసపోకుడి; జారులైనను, విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుషసంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. మీలో కొందరు అట్టివారై యుంటిరి; గాని, ప్రభువైన యేసు క్రీస్తు నామమునను, మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి" (1 కొరింథీయులకు 6:9బి–11).*